శుభపంతు వరాళి - రూపకం

ఆకటి వేళల - అలపైన వేళల
తేకువ హరినామమే - దిక్కు మరిలేదు

కొఱమాలి యున్న వేళ - కులము చెడిన వేళ
చెఱవడి యొరులచే - జిక్కిన వేళ
నొఱపైన హరినామ - మొక్కటే గతిగాక
మఱచి తప్పిననైన - మఱిలేదు తెఱగు

ఆపద వచ్చినవేళ - యాఱడి బడినవేళ
పాపపు వేళల - భయపడిన వేళ
ఓపినంత హరినామ - మొక్కటే గతిగాక
మాపుదాకా బొరలిన - మరిలేదు తెఱగు

సంకెల బెట్టిన వేళ - చంప బిలిచిన వేళ
అంకిలిగా నప్పులవా - రాగిన వేళ
వేంకటేశు నామమే - విడిపించ గతిగాక
మంకుబుద్ధి బొరలిన - మరిలేదు తెఱగు

శృంఖలా బద్ధుడైన అన్నమాచార్యులు తన బాల్యమిత్రుడైన సాళ్వ నరసింగరాయలు ఆగడానికి ఖిన్నుడై పలికిన సంకీర్తన ఇది.

ఆకలియైనపుడు అలపు మిక్కిలియైనప్పుడు ఓదార్పు తరణోపాయము హరి నామ మేతప్ప వేరొక గతిలేదు.నిష్ప్రయోజకుడుగా ఉన్నప్పుడు - కులాచార భ్రష్టత కల్గినప్పుడు ఇతరుల చేజిక్కినప్పుడు శరణ్యమైన హరినామస్మరణ మాత్రమే గతి. పొరపాటునగూడా వేరొక మార్గంలేదు.

ఆపదలు వచ్చినప్పడు ఆవేదనలు కల్గినప్పుడు పాపం మిక్కిలియై చరించేటప్పుడు - ధన మాన ప్రాణ భయాలు కల్గినప్పుడు యధా శక్త్యనుసార హరినామ సంకీర్తన మొక్కటేగాని, ఉదయాస్తమయందాకా ఎంత గింజుకున్నా మార్గాంతరం లేదు.

సంకెళ్లు తగిలించినవేళ - చంపకొనిపోయేవేళ - అప్పులవాళ్లు వేచి వున్న వేళల్లో శ్రీవేంకటేశుని నామమొక్కటే విడిపించగలిగిన గతి. అది ఒక్కటే విమోచనకారి. మూర్ఖంగా ఇతరత్రా ఎంత అన్వేషించినా మరొక దారిలేదు అని ఈ సంకీర్తనం పాడగానే ఆచార్యుల చేతులకు వేసిన మూరురాయరగండ సంకెల తెగి కిందపడింది. ఈ అద్భుతం చూసి భయపడ్డ భటులు పరుగుపెట్టి రాయలకు ఈ సంగతి నివేదించగా రాయలుతానే స్వయంగా వచ్చి అన్నమాచార్యులతో 'నీ కనికట్టు విద్య నా ముందర పారదు. అంతమహిమగలవాడవైతే ఏదీ మళ్లీ పాడు. ఈసారి ఈ సంకెల విడిపించుకో చూద్దాం' అనితన ఎదురుగా మళ్లీ సంకెల వేయించారు. తన మిత్రుని అజ్ఞానానికి చిరునవ్వు చిందించారు అన్నమాచార్యులు.